క్లుప్తంగా

క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జెన్‌పాక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 250 మంది విద్యార్థులు హాజరు కాగా వివిధ ఇంటర్వ్యూల అనంతరం 86మందిని ఎంపిక చేశారు. ఎంపికై న విద్యార్థులను కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, ఏవో రాధాకృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి సీహెచ్ ప్రవీణ్‌కుమార్, సంతోషి, రజిత, ఇలియాజ్ అలీ, ఆజారుద్దీన్, సుప్రియ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులపై దాడికి నిరసన



నిరసన తెలుపుతున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులపై దాడికి నిరసనగా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సోమవారం ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విశాల్, డాక్టర్ రవిప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ సాయిని నరేందర్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద ఓటు విజయవంతం

కరీంనగర్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఇంటివద్దనే ఓటింగ్ సౌకర్యం కల్పించారు. కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం 123 మంది ఇంటి వద్ద ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు 74, దివ్యాంగులు 49 మంది ఉన్నారు. ఈనెల 3నుంచి సోమవారం వరకు ఇంటి వద్ద ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. వృద్ధులు 74 మందికి 70, దివ్యాంగులు 49 మందికి 46 మంది ఓటుహక్కును వినియోగించుకోగా మిగితా ఏడుగురు పలు కారణాలతో ఓటు వేయలేదని అధికారులు తెలిపారు.

జన జాతర సభాస్థలి పరిశీలన

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించనున్న జనజాతర సభాస్థలిని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలు పాల్గొనే ఈ సభకు 50 వేల మంది హాజరుకానున్నారని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విద్యానగర్(కరీంనగర్): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సిరిపాటి వేణు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేషన్‌కు ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బైరి వెంకటేశంను చైర్మన్‌గా నియమించాలని అన్నారు. ఈ సమావేశంలో సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు తుర్పాటి లింగయ్య, హుజురాబాద్ మండల అధ్యక్షుడు చింతల సతీశ్‌వర్మ, చంద్రగిరి సందీప్ పాల్గొన్నారు.

ఎండీ ఖాలిద్‌కు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందకుంటున్న ఎండీ ఖాలిద్

కరీంనగర్‌కల్చరల్: అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ తెలంగాణ శాఖ, అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ సంస్కృతి కేంద్రంలో జరిగిన శ్రీక్రోధి ఉగాది కవితా కదంబం పుస్తకావిష్కరణలో కరీంనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్, రచయిత ఎండీ ఖాలిద్‌కు తన కవితా పఠనానికి శాలువా, ప్రశంసాపత్రం అందజేశారు. అతిథులుగా హాజరైన తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ గౌరీశంకర్, ఏసీడబ్ల్యూఏ అధ్యక్షుడు రామ్మూర్తి, ఏబీబీఎస్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గోళ్లమూడి పద్మావతి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని ఖాలిద్ అందుకున్నారు.

శిక్షణ వేళ.. తస్మాత్ జాగ్రత్త

- దంచి కొడుతున్న ఎండలు
- క్రీడా శిక్షణ శిబిరాల్లో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న క్రీడా విశ్లేషకులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్య నిపుణులు



మైదానాల్లో ఎండను సైతం లెక్కచేయకుండా సాధన చేస్తున్న చిన్నారులు

కరీంనగర్ స్పోర్ట్స్: వేసవిలో ఏటా క్రీడా శాఖ ఆధ్వర్యంలో సుమారు 30 రోజుల పాటు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయి. ఈయేడు కూడా కూడా ఈనెల 1 నుంచి జిల్లా క్రీడా శాఖ, పలు క్రీడా సంఘాల ఆధ్వర్యంలో పలు క్రీడా శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఓవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. ఇప్పటికే 46 డిగ్రీలపై స్థాయికి చేరుకోగా నిప్పుల కుంపటిలా మారింది. ఇంతటి వేడిని తట్టుకుంటూ క్రీడల్లో శిక్షణ పొందటం అంత సులువు కాదంటున్నారు పలువురు క్రీడా విశ్లేషకులు. విద్యార్థుల శరీరంలోని నీటిశాతం తగ్గడంతో పాటు వడదెబ్బ తగిలి అనారోగ్యానికి గురికాక తప్పదంటున్నారు. శిక్షణ ఇచ్చే శిక్షకులతో పాటు పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటంలో తల్లిదండ్రులు సైతం జాగ్రత్తలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ సమయంలో సమయపాలన, ఆహారం, పండ్ల రసాలు, పరిశుభ్రమైన నీరు సకాలంలో తీసుకొంటే ఎలాంటి ఇబ్బందులు తెలెత్తవంటున్నారు. ఈ సందర్భంగా వేసవిలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు ఏం చేయాలి, ఎక్సర్‌సైజ్‌లు ఎలా చేయాలి, ఏ సమయంలో చేయాలి, ఎలాంటివి తీసుకోవాలని తదితర విషయాలు మీ కోసం..

జిమ్ సెంటర్.. క్రీడా శిబిరాల్లో..



ఏటా వేసవి సెలవుల్లో జిమ్ సెంటర్‌లకు బారులు కడుతారు. వివిధ క్రీడల్లో చిన్నారులు సైతం శిక్షణ తీసుకుంటారు. ప్రస్తుతం మండుతున్న ఎండలో శిక్షణ తీసుకునే వారు, జిమ్ సెంటర్‌లో ఎక్సర్‌సైజ్ చేసే వారు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు క్రీడారంగ విశ్లేషకులు. ఉదయం, సాయంత్రం సమయపాలనలో చేస్తే ఎలాంటి ఇబ్బందులుండవని సూచిస్తున్నారు.

దుస్తుల వాడకం

శిక్షణ పొందే క్రీడాకారులు మందంగా ఉండే దుస్తులు ఉపయోగించవద్దు. నైలాన్ లాంటివి కాకుండా కాటన్‌లా ఉండే వాటినే వేసుకోవాలి. ఉదయం వేసుకున్న దుస్తులు సాయంత్రం వేసుకోవద్దు. ఒకసారి వాడిన దుస్తులను మళ్లీ వేసుకోకుండా ఉతికిన తర్వాతనే వేసుకోవాలి. షూలు కూడా జాలి ఉండే విధంగా వేసుకుంటే మంచిది.

వాతావరణంలో జాగ్రత్తలు..

గ్రామీణ ప్రాంతాల్లో పొలాలు, చెట్లు ఎక్కువగా ఉండటంతో వాతావరణం చల్లగా ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రత ఇప్పటికే సుమారు 44 డిగ్రీలకు చేరుకుంది. రాత్రి సమయంలో కూడా వేడి తగ్గడంలేదు. అత్యధిక వేడిలో ఆటలు ఆడటం కంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం తప్పనిసరి. ఉ.8 గంటల లోపు, సాయంత్రం 6 గంటల తర్వాత నుంచి శిక్షణ తీసుకోవడం మంచిది. ఉదయం శిక్షణ తర్వాత కొంత సమయం నిద్రపోతే మేలు కలుగుతుంది.

తగిన ఆహారం తీసుకోవాలి



శిక్షణ తీసుకున్న కాలంలో ప్రతిరోజూ ఆకు కూరలు, కూరగాయలు, మజ్జిగ తీసుకోవాలి. వీటితో పాటు నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లు, పండ్ల రసాలు సేవించాలి.

నీరు తాగాలి



ఉదయం పూట శిక్షణకు వెళ్లే క్రీడాకారులు తగినంత నీటిని తాగాలి. ఇంటి నుంచే ఒకటికి రెండు బాటిళ్లు నీటిని తీసుకెళ్లాలి. ఉదయం అరటి పండు తింటే శరీరంలో విటమిన్ లోపం తలెత్తదు. శిక్షణ ముగిసే వరకు ప్రతిరోజూ పుచ్చకాయ తినడం ఆరోగ్యానికి మంచిది. అందులో 90శాతం నీరు ఉంటుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేసవిలో పిల్లలు ఆటలు ఆడేందుకు ఇష్టపడుతారు. పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ తల్లిదండ్రులే చూసుకోవాలి. శిక్షణ శిబిరాల్లో కోచ్‌లు సూచనలు చేయాలి. నీటి శాతం ఎక్కువగా ఉన్న వాటినే తీసుకునే విధంగా చూడాలి. ఎక్కువ సమయం ఆటల్లో పాల్గొనకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ రామ్మోహన్, పిల్లల వైద్య నిపుణుడు,, కరీంనగర్

గ్లూకోజ్‌తో అదనపు శక్తి

గ్లూకోజ్ పొడిని నీటిలో కలుపుకొని తాగడం వల్ల శరీరానికి అదనపు శక్తి సమకూరుతుంది. శరీరంలో నీటి శాతం పెరగడమే కాకుండా ఎప్పుడూ తేమలా ఉంచుతుంది. గ్లాసెడు నీటిలో ఉదయం, సాయంత్రం ఒక చెంచా పొడిని కలిపి తాగితే సరిపోతుంది.

శక్తికి మించి చేయొద్దు

శరీరం శక్తి సామర్థ్యాలకు మించి శిక్షణ పొందరాదు. పోటీ పడి అధిక బరువులు ఎత్తడం, దూకడం, పరుగెత్తడం, వ్యాయామ కృత్యాలు తదితర వాటిని చేయడం వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గి కోలుకోలేని స్థితికి చేరుకుంటాం. అతి వేగంగా ఆడి వెంటనే నీటిని తాగరాదు. ముఖ్యంగా జిమ్‌కు వెళ్లే వారు అధిక ఎక్సర్‌సైజులు చేయొద్దు.

చల్లని నీటితో స్నానం మేలు

శిక్షణ పొందిన తర్వాత క్రీడాకారులు ఉదయం, సాయంత్రం వేళలో చల్లని నీటితో స్నానం చేయడం ఆరోగ్యానికి మంచిది. ఎండలో చల్లని నీటితో స్నానం చేయరాదు. నీడ వసతి ఉన్న చోటనే చల్లని నీటితో ఎక్కువ సేపు స్నానం చేయాలి.

గ్రానైట్ ఇండస్ట్రీని నిలబెట్టుకుందాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: నష్టాల్లో ఉన్న గ్రానైట్ ఇండస్ట్రీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని, ఎంపీగా గెలిపిస్తే గ్రానైట్ రంగ అభివృద్ధికి కృషి చేస్తానని కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు హామీ ఇచ్చారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన గ్రానైట్ అసోసియేషన్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను ఒకప్పుడు గ్రానైట్ రంగంలో నష్టాలను చవి చూశానని, ఇండస్ట్రీ గురించి తనకు కొంతమేర అవగాహన ఉందన్నారు. 400 మంది పారిశ్రామికవేత్తలు ఉన్న గ్రానైట్ రంగం ప్రస్తుతం నష్టాల్లో ఉందని, పరిష్కార మార్గాలను అన్వేషిస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, గ్రానైట్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం కరీంనగర్ పార్లమెంట్‌స్థాయి సమావేశం



బుక్‌లెట్ విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో మంగళవారం సీపీఎం కరీంనగర్ పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి వెల్లడించారు. సోమవారం కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో సీపీఎం ఎన్నికల మేనిఫెస్టో బుక్‌లెట్ విడుదల చేశారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పన్నంగా అమ్మి వేసిందని, తనకు కుటుంబమే లేదంటున్న మోదీ అంబానీ, అదాని లాంటి కార్పొరేట్ కంపెనీ తన కుటుంబమని, ప్రజలు కష్టపడి కట్టిన పన్నులను, ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి గుడికందుల సత్యం, జి.బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు. శ్రీనివాస్, ఎడ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'న్యాయం చేయండి'

విద్యానగర్(కరీంనగర్): తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి బెదిరింపులతో భయాందోళన కలిగిస్తూ భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని బాధితురాలు శ్రీమల్ల లక్ష్మీ అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌లోని సర్వేనంబర్ 22బీలో 1984లో రాగి భద్రయ్య నుంచి తాను కొనుగోలు చేసిన 8 గంటల భూమికి తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి సర్వే నంబర్ 22ఏగా చూపించి బెదిరింపులతో కొంతమంది భూ కబ్జాకు యత్నిస్తున్నారని అన్నారు. ఆ భూమిలో తాను సీతారాంపూర్ గ్రామపంచాయతీ ద్వారా అనుమతి పొంది ప్రహరీ నిర్మించినట్లు తెలిపారు. ఆ తర్వాత కరీంనగర్ మున్సిపల్ పరిధిలో రాగా 2020లో ఇంటి నిర్మాణానికి అనుమతి పొందినట్లు తెలిపారు. ఆ భూమిని నంబర్ 22ఏగా చూపించి తప్పుడు డాక్యుమెంట్‌లతో బొంతల మల్లేశం ద్వారా కొత్త జైపాల్‌రెడ్డి అనుచరులుగా చెప్పుకుంటున్న లక్ష్మారెడ్డి, రమేశ్, విజయ్ భాస్కర్‌రెడ్డి తన భూమిని ఆక్రమించాలనే ఉద్దేశ్యంతో రిజిష్టర్ సేల్ డీడీ సృష్టించి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తగిన చర్యలు తీసుకొని తన ఆస్తిని రక్షించి న్యాయం చేయాలని అధికారులను కోరారు.

'ఆరోపణలో వాస్తవం లేదు'

సీతారాంపూర్‌లోని సర్వే నంబర్ 22బీలోని 8 గుంటల భూమి విషయంలో శ్రీమల్ల లక్ష్మీ చేస్తున్న ఆరోపణలో నిజం లేదని విజయ్‌భాస్కర్ రెడ్డి అన్నారు. వాస్తవానికి ఇది సర్వే నంబర్ 22ఏ పరిధిలోకి వచ్చే భూమి అయినప్పటికీ ఆమె తప్పుడు ఆరోపణలు చేస్తున్నరని తెలిపారు.

అభిషేక అర్చనలు.. ప్రవచనాలు

కరీంనగర్ కల్చరల్: విద్యానగర్ బీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఉత్సవ నిర్వహణ సమితి, యతిరాజ సేవామండలి, వికాసతరంగిణి ఆధ్వర్యంలో జరుగుతున్న సవాహ్నిక ఏకకుండాత్మక శ్రీమద్రామాయణ మహాక్రతువులో భాగంగా సోమవారం సాలగ్రామ అభిషేకం, శ్రీసీతారామ, ఆంజనేయ అర్చనలు, హవనం, అన్నదానం నిర్వహించారు. పారాయణాలు, వివిధ ప్రాంతాలకు చెందిన పండితుల ప్రవచనాలు జరిగాయి. కార్యక్రమంలో బల్మూరి ప్రభాకర్‌రావు, కరుణాకర్‌రావు, మాదాడి కిశోర్‌కుమార్, డాక్టర్ శివకుమార్, ప్రసూన్‌రావు, లక్ష్మీగిరిధర్‌రావు, లావణ్యా శ్రీపతిరావు, వంశీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి దుర్గాభవానీ ఆలయ సప్తమ వార్షికోత్సవం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూరులోని దుర్గాభవానీ ఆలయంలో ఈనెల 10 నుంచి 12 వరకు అమ్మవారి సప్తమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ తెలిపారు. 10న గణపతి పూజ, గురువందనం, అమ్మవారికి విశేషాభిషేకం, జగత్ప్రసూతికాలంకరణ, చండీహోమం, పూర్ణాహుతి, ప్రసాద వితరణ జరుగుతుందని అన్నారు. 11న సౌందర్యలహరి హోమం, పూర్ణాహుతి, హనుమాన్ చాలీసా పారాయణం, భవానీ సుందరేశ్వరుల ఎదుర్కోళ్లు, 12న శంకరాచార్య జయంతి పురస్కరించుకుని శంకరాచార్యుల వారికి విశేష పంచామృతాభిషేకం, భాష్యపారాయణం, దుర్గాభవానీ సుందరేశ్వరుల కల్యాణం, మహా అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

ఓటుహక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ముజాఫర్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని రజ్వీచమన్, సిటిజన్ కాలనీల్లో సోమవారం సామాజిక కార్యకర్త, లోక్‌సత్తా ప్రతినిధి సయ్యద్ ముజాఫర్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీల్లో ప్లకార్డులు చేతపట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు జాబిర్ ఉల్‌హక్, సయ్యద్ అఫ్జల్, గులాంఖాన్, అంజద్‌అలీ, మహ్మద్ షాహిద్, రఫీక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బండి సంజయ్‌పై ఫిర్యాదు

కరీంనగర్ కార్పొరేషన్: విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ ప్రజలను పదేపదే రెచ్చగొడుతున్న ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సోమవారం ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసింది. హిందువుల ఆరాధ్యదైవమైన శ్రీరాముడిని తన రాముడిగా చెప్పుకుంటూ రాముడి పేరును ఎన్నికల ప్రచారంలో వాడుకుంటున్నాడని కాంగ్రెస్ నాయకులు సుజిత్‌కుమార్, ఆంజనేయులుగౌడ్, గోపి ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీరాముడిని కాంగ్రెస్ నాయకులు అవమానిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తక్షణమే బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీవైష్ణవ సంఘం రజతోత్సవ సన్నాహక సమావేశం

కరీంనగర్‌కల్చరల్: హైదరాబాద్, ఎల్బీనగర్ చంద్రాపూర్ కాలనీలోని శ్రీవైష్ణవ సేవాసంఘం భవన్‌లో ఆదివారం జరిగిన రజతోత్సవ సన్నాహక సమావేశంలో జిల్లాకు చెందిన సంఘ బాధ్యులు పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీచర కృష్ణమాచార్య, గోవర్ధనగిరి శశికిరణ్ ఆచార్యతో పాటు వానమామలై శ్రీనివాసాచార్యులు, పెద్దపల్లి జిల్లా గౌరవ అధ్యక్షుడు గోవర్ధనగిరి జగన్నాథాచార్యులు, అధ్యక్షుడు కాందూరి శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

'రెడ్డిలకు క్షమాపణ చెప్పాలి'

విద్యానగర్: రెడ్డి సంఘాలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నాయని ఆర్‌బీవీఆర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు జగ్గారెడ్డి చెప్పడాన్ని రెడ్డి సంఘాలు ఖండించాయి. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెడ్డి సంఘం నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సంఘాలు మద్దతు ఇస్తున్నయన్న విషయంలో ఎలాంటి నిజం లేదన్నారు. జగ్గారెడ్డి తన లబ్ధికోసం కాంగ్రెస్ పార్టీకి సంఘాన్ని తాకట్టు పెట్టడానికి సిద్ధపడడం సిగ్గుచేటాన్నారు. ఈ విషయంలో అధ్యక్షుడు జగ్గారెడ్డి, రెడ్డిలందరికీ క్షమాపణ చెప్పి తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రెడ్డి సంఘం బాధ్యులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, కాసర్ల మధూకర్ రెడ్డి, బేతి మహేందర్ రెడ్డి, కూర మహిపాల్‌రెడ్డి, పోరెడ్డి జనార్దన్‌రెడ్డి, కాల్వ పూర్ణచందర్ రెడ్డి, రావుల కిరణ్ రెడ్డి, న్యాలకొండ ప్రసన్నకుమార్ రెడ్డి, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, కంతారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జున్నుతుల రాజిరెడ్డి, కొత్త మహేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, నరసింహారెడ్డి గణపతి రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మునిందర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మోదీ.. కరీంనగర్‌లో బండి హవా



మాట్లాడుతున్న శ్రీనివాస్

కరీంనగర్‌టౌన్: దేశవ్యాప్తంగా బీజేపీ మోదీ హవా, కరీంనగర్‌లో బండి సంజయ్ హవా నడుస్తుందని, ప్రజలు ఓటు వేసే విషయంలో స్పష్టమైన నిర్ణయం, ఆలోచనతో ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోలెంకి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని పార్లమెంటు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలైన దొంగలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు చెబితేనే ఫోన్లను ట్యాప్ చేశామని రాధాకిషన్ రావు పోలీసుల విచారణలో వెల్లడించారని, ఇంత స్పష్టమైన ఆధారాలున్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలపై చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ వెనకడుగు వేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌తో కుమ్మక్కైనందువల్లే తదుపరి విచారణ లేకుండా కేసును నీరుగారుస్తుందని మండిపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు ఎన్నం ప్రకాశ్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, జిల్లా అధికార ప్రతినిధి, సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర, నాయకులు రంగు సంపత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రాంతమే.. ప్రచార వేదిక



ఉపాధికూలీలతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్ సతీమణి మాధవి

కరీంనగర్‌రూరల్: లోక్‌సభ ఎన్నికలు వేసవిలో వచ్చాయి.. గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జో రుగా సాగుతున్నాయి. ఎండల దృష్ట్యా ఉదయం పూటనే కూలీలు పనులకు వెళ్తున్నారు. ఎక్కువ మంది ఉపాధిహామీ పని ప్రాంతాల్లోనే ఉంటున్నారు. సోమవారం గోపాల్‌పూర్‌లో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి మాధవి ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గతంలో ఎంపీగా వినోద్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులను వివరించి మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఓటమి తప్పదు



మాట్లాడుతున్న హరిశంకర్

కరీంనగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఓటమి తప్పదని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అన్నారు. నగరంలోని మీసేవా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోయి గోసపడొద్దన్నారు. బండి సంజయ్ తాను చేసిన అభివృద్ధి చెప్పి ఓట్లు అడుగాల్సిందిపోయి దేవుడి పేరిట, కులమతాల విభజన పేరిట ఓట్లు అడగటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల ఓ పారాచూట్ అని ఎప్పుడు ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదని, తండ్రి, తాత పేరు చెప్పి ఓట్లు అడగటం విచారకరమని తెలిపారు. ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరుతూ ఎమ్మెల్యే కమలాకర్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వారు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు నష్టమేమి లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, కులదీప్ వర్మ, సాయికృష్ణ, షౌకత్, వాజిద్, గంగాధర చందు, నవాజ్, రవి, చంద్రశేఖర్, శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్ దోపిడీ సామ్రాజ్యానికి కరీంనగర్ కేంద్రం'



మాట్లాడుతున్న కటకం మృత్యుంజయం

కరీంనగర్ కార్పొరేషన్: కేసీఆర్ అవినీతి పాలనకు, దోపిడీ సామ్రాజ్యానికి కరీంనగర్ కేంద్ర బిందువైందని పీసీసీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం అన్నారు. సోమవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలిందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్రానైట్, ఇసుక మాఫియాలతో ప్రకృతిని నాశనం చేశారన్నారు. ఒకే నంబర్ ప్లేట్‌తో ఉన్న వంద లారీలు ఇసుకను తరలిస్తే దిక్కేలేదన్నారు. కేసీఆర్ బాషలో చెప్పాలంటే తెలంగాణ అనే పదాన్ని 20 కిలోమీటర్ల లోతులో పాతిపెట్టి టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారని విమర్శించారు. రాముడి పేరుతో ఓట్లడగడం తప్ప బీజేపీ చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని, కాంగ్రెస్‌కు 14 సీట్లు వస్తాయన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక




కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలతో రాజేందర్‌రావు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరుకు చెందిన పలువురు బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీటీసీ దావు సంపత్, వార్డుసభ్యులు బి.హన్మంతరావు, కోట కరుణాకర్, ఎండీ హమీద్‌తో పాటు 25మంది ముఖ్యకార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.రాంరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు ఎస్.తిరుపతి, నాయకులు ఎస్.రాజు, లక్ష్మణ్‌రావు, శేఖర్, శ్రీనివాస్, కొమురయ్య, రాజేశ్‌ఖన్నా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'పదేళ్లలో పునర్నిర్మాణం చేయలేదెందుకు?'

కరీంనగర్ కార్పొరేషన్: తెలంగాణ రాష్ట్రం సాధించాక ఈ పదేళ్లలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ తెలంగాణను పునర్నిర్మాణం ఎందుకు చేయలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ శాసన మండలి సభ్యుడు టి.సంతోష్‌కుమార్ ప్రశ్నించారు. ఓట్ల కోసం తెలంగాణ ప్రజలను మరోమారు మోసం చేసేందుకు కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్‌ను రాజేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన రోడ్డు షోలు, ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొన్న కేసీఆర్ తెలంగాణ ఉద్యమం ఇంకా ఉందని, రాష్ట్ర పునర్నిర్మాణం మిగిలే ఉందంటూ తెలంగాణ సెంటిమెంట్‌ను మరోసారి రాజేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణాకు జరిగిన నష్టం కంటే పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన విధ్వంసమే అధికమన్నారు. ఈ ఎన్నికల్లో ఆయన కుట్రలు సాగవన్నారు.

రేకుర్తిలో బీజేపీ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో 37, 38, 39, 40వ బూత్‌ల అధ్యక్షుల ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఓటరు స్లిప్పులు, నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలు, బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై కరపత్రాలు పంపిణీ చేశారు. డివిజన్ ఇన్‌చార్జి, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నిర్మలరెడ్డి, బీజేపీ బూత్ అధ్యక్షులు నాంపల్లి శంకర్, పింగిలి ప్రతాపరెడ్డి, పీచర విష్ణు ప్రసాద్‌రావు, లక్ష్మీరాజం, గోదరి నరేశ్, మహిళా మోర్చా నాయకురాలు వేదం శిల్ప, వరాల జ్యోతి, చంద్రకళ, పరమేశ్వర గురుస్వామి, జనగాం రజిత, ముదిమడుగుల రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.